క్లుప్తంగా

శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకున్న విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుతూ తిరుపతిలో చాతుర్మాస దీక్షలో ఉన్న పరమాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు కుటుంబ సభ్యులకు కంచి పరమాచార్య స్వామి ఆశీస్సులు అందజేశారు.

నిలిపివేసిన పెన్షన్లను పునరుద్ధరించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): సర్టిఫికెట్ల వెరిఫికేషన్ల పేరుతో దివ్యాంగులకు నిలిపివేసిన పెన్షన్లను వెంటనే పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశను పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దివ్యాంగులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 150 మంది దివ్యాంగులకు ప్రభుత్వం ఈ నెలలో పెన్షన్ల పంపిణీ నిలిపివేసిందని దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి గంటేటి సుజాత తెలిపారు. పెన్షన్లు నిలిపివేసిన దివ్యాంగులందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని ఆమె కోరారు.

హిందీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దక్షిణ భారత హిందీ ప్రచార సభ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చారులత హైద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం కళాశాల సిబ్బంది, విద్యార్థులు చారులతను చిత్రపటం, శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. 2022లో ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. డాక్టర్ చారులత విద్యార్థులకు విశేష సేవలు అందించారని కొనియాడారు. తాను పనిచేసిన మూడు సంవత్సరాలలో తనపై చూపించిన ఆదరాభిమానాలు మరువలేనివని, ఎక్కడ ఉన్నా ఈ కళాశాలలో పనిచేసిన రోజులను మర్చిపోలేనని అన్నారు. తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాచవరం దక్షిణ భారత హిందీ ప్రచార సభ బీఈడీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా హైద్రాబాద్ నుంచి డాక్టర్ జుబేర్ అహ్మద్ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు.

ఎల్అండ్‌టీ డ్రెయినేజీ కాల్వలోకి వరద నీరు మళ్లింపు



పాయకాపురం(విజయవాడరూరల్): అంబాపురం, జక్కంపూడి ఆ పై ప్రాంతాల నుంచి వస్తున్న బుడమేరు వరద నీటిని ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఉన్న మురుగు కాల్వలోకి మళ్లించారు. విజయవాడ నగరపాలక సంస్థ రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాలకు రాకుండా పొలాల నుంచి వచ్చే బుడమేరు నీటిని 64వ డివిజన్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న అవుట్‌పాల్ డ్రెయినేజీ కాల్వలోకి రాకుండా ఎల్అండ్‌టీ డ్రెయినేజీ కాల్వలోకి పారుదల అయ్యే విధంగా మోటార్లను ఏర్పాటు చేశారు. ఆ నీరు కల్వర్టు నుంచి రోడ్డు అవలి వైపు వెళ్లే విధంగా వీఎంసీ చర్యలు చేపట్టింది. అత్యవసర పరిస్థితుల్లో నీటిని తోడేందుకు అదనపు మోటార్లను జనరేటర్లను ఏర్పాటు చేశారు.

చినుకు.. వణుకు

- కాగితాలకే పరిమితమైన 'ఆపరేషన్ బుడమేరు'
- ఏడాది అవుతున్నా అతీగతీలేని వైనం
- హడలిపోతున్న బుడమేరు పరిసర ప్రాంతాల ప్రజలు



బుడమేరులో పెరుగుతున్న వర్షపునీరు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): యావత్ రాష్ట్రాన్ని గత ఏడాది కలవరానికి గురిచేసిన బుడమేరు వరదలు మళ్లీ బుడమేరు పరిసర ప్రాంత ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పైనుంచి భారీగా వరద నీరు రావడం.. ఇటీవల కురుస్తున్న వర్షాలు ఇక్కడి న్యూఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్, నందమూరినగర్, రామకృష్ణాపురం పరిసర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఆపరేషన్ బుడమేరు.. అందరూ మరిచారు..

బుడమేరు వరదలకు ప్రధాన కారణం అయిన బుడమేరులో ఆక్రమణలను తొలగించేందుకు నాడు వరదల సమయంలో ప్రభుత్వం తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ఆపరేషన్ బుడమేరును యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు ప్రకటించారు. అప్పటి కలెక్టర్ సృజన సంబంధిత కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో సమావేశాలు కూడా నిర్వహించారు. సర్వే నంబర్లతో సహా ఆక్రమణలపై సత్వరమే పూర్తి నివేదికను సిద్ధం చేయాలని వారిని ఆదేశించారు. బుడమేరులో ఆక్రమణల తొలగింపును పక్కన పెడితే కనీసం మిగిలిన బుడమేరును సంరక్షించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది.

ఈ ఏడాదిలోనూ ఆక్రమణలు..

ఈ ఏడాది కాలంలో రాఘవేంద్ర థియేటర్ వెంబడి బుడమేరు కాలువ, రామకృష్ణాపురం, అయోధ్యనగర్ నుంచి న్యూఆర్ఆర్‌పేటకు వెళ్లే దారితో పాటు సుందరమ్మదిబ్బ, న్యూఆర్ఆర్‌పేట, సన్‌సిటీ కాలనీ, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లో బుడమేరు అనేక చోట్ల ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలను తొలగించి రిటైనింగ్ వాల్ నిర్మించి తమకు బుడమేరు వరదల ముప్పు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపెడతారని ప్రజలంతా భావించినా ఆ దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచనలు చేసిన దాఖలాలు లేకపోవడంతో మళ్లీ జనాల గుండెల్లో వరదల భయం పట్టి పీడిస్తోంది.

ఇటీవల వర్షాలకు..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు బుడమేరు కాలువలో రోజు రోజుకు పెరుగుతున్న నీటిమట్టం పక్కనున్న రోడ్ల అంచులను తాకుతున్నాయి. వర్షాలు దంచి కొట్టినా.. పైనుంచి బుడమేరుకు ఏవైనా నీళ్లు వదిలినా ఇక ఆ నీరంతా రోడ్లపైకి, ఇళ్లల్లోకి చేరిపోతోంది.

రహదారులు జలమయం

కొద్దిపాటి వర్షం పడినా సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు అన్ని ప్రాంతాలు జలమయ మవుతున్నాయి. బుడమేరు వరదల తరువాత ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ చాలాచోట్ల సక్రమంగా లేదు. కొన్ని చోట్ల అసలు సైడ్ డ్రెయిన్ల నిర్మాణమే జరగలేదు. దీంతో కొద్దిపాటి చినుకులు పడినా నీరు పారే దారి లేక రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. ఎక్కడైనా వర్షపునీరు రోడ్లపై, ఇళ్లల్లో నిలిచిపోతే మోటార్ల సాయంతో వాటిని తొలగించి తాత్కాలిక చర్యలను సిబ్బంది చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు డ్రెయిన్లు సక్రమంగా పారేలా చూడడంతో పాటు అవసరమైన చోట్ల నూతన డ్రెయిన్లను నిర్మించి ముంపు సమస్య నుంచి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కొద్దిపాటి వర్షాలకు సింగ్‌నగర్‌లో రోడ్డు ఇలా (ఫైల్)



న్యూఆర్ఆర్‌పేట అపార్ట్‌మెంట్‌ల వెనుక పొలాల్లోకి చేరిన నీరు

ఆందోళనగా ఉంటోంది



బుడమేరు వరదలు వచ్చి సంవత్సర కాలం గడుస్తున్నా నేటికి ఆ భయం మా ప్రాంత ప్రజలందరిలో ఉంది. వాటిని మరిచిపోకముందే మళ్లీ ఇప్పుడు బుడమేరు పొంగిపొర్లడం, పలు చోట్ల ఇళ్లల్లోకి నీళ్లు వచ్చేస్తున్నాయనే విషయాలు వింటుంటే మరింత ఆందోళనగా ఉంటోంది. ఎటువంటి నష్టాలు జరగకముందే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– అపర్ణ, అరుణోదయనగర్

కంటిమీద కునుకు లేదు



వర్షాలు పడుతున్నాయంటేనే మా ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు ఉండడం లేదు. ఎటునుంచి బుడమేరు పొంగుతుందో అనే భయం వెంటాడుతూనే ఉంది. గతేడాది బుడమేరు వరద బీభత్సం చవిచూసిన తరువాత ప్రభుత్వం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకుందో అస్సలు అర్థం కావడం లేదు. బుడమేరు కాలువ వెంబడి రిటైనింగ్ వాల్‌లా నిర్మిస్తే బాగుంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచనలు చేయాలని కోరుతున్నాం.

– మల్లల చెన్నకేశవరెడ్డి, న్యూఆర్ఆర్‌పేట

వీఎంసీలో పీజీఆర్ఎస్



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 9 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక –4, ఇంజినీరింగ్ –4, రెవిన్యూ –1 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ 11 కేవీ బీసెంట్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్పావారి వీధి, వంగవీటి రాధా రోడ్డు, మద్దులపల్లి వీధి, పాలపర్తి వారి వీధి, బీసెంట్ రోడ్డు, దున్నా వారి వీధి, గోపాలరెడ్డి రోడ్డు, పెద్ది బొట్ల వారి వీధి, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు (నవరంగ్ ఏరియా) తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం



కండ్రికలో స్థానికులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాఘవన్

పాయకాపురం(విజయవాడరూరల్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షంతో నగర శివారు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. భవన నిర్మాణ పనులకు, పొలాల్లో కూలి పనులకు వెళ్లే వారు ఇంటిని వదిలి బైటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. విడవకుండా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై వర్షంనీరు ప్రవహించింది. కొత్త రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై ప్రవహించిన నీరు చెదురు మదురుగా ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. రాజీవ్‌నగర్‌లో అవుట్‌పాల్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణం పనులు స్తంభించడంతో మురుగు సాయిబాబా గుడి వద్ద నిలిచిపోయింది. కాల్వల్లో వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు.

ప్రత్యేకాధికారి పర్యటన

64వ డివిజన్‌లో ప్రత్యేక అధికారి రాఘవన్ లగడపాటి కల్యాణ మండపం, బీవీ సుబ్బారెడ్డి స్కూల్ ప్రాంతాల్లో డ్రెయినేజీ కాల్వలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి, కాల్వల్లో నీరు నిలబడకుండా వ్యర్థాలను తొలగించాలని, నీటి ఉధృతి పెరిగితే మోటార్లు పెట్టి వాటిని తోడించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజుకు చెప్పారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు యర్రగొర్ల శ్రీరాములు ఉన్నారు.

భక్తిరస భరితం హరికథాగానం



విజయవాడ కల్చరల్: హరికథాపితామహుడు శ్రీమద్దాడ ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంతి సందర్భంగా ఆదిభట్ల నారాయణ దాసు శిష్యప్రశిష్య బృందం, అన్నమయ్య పరివారం. రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ ప్లాంజేరి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న హరికథా సప్తహం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో గుంటూరుకు చెందిన టీ దివ్యసాయి శ్రీరామజననం, గద్వాల్ కాశీవిశ్వనాథ్ శ్రీరామ సుగ్రీవ మైత్రి, పీ వేదవతి నర్తనశాల, బోడిగల లక్ష్మీనారాయణ అమరలింగ చరిత్రలను వినిపించారు. అన్నమయ్య పరివారానికి చెందిన కొల్లి తేజ పేద కళాకారులను సత్కరించారు. హరికథా భాగవతార్ బీవీఎస్ శర్మ నిర్వహించారు. అమ్మల ప్రసాద్, పాలపర్తి ఆంజనేయులు వాద్య సహకారం అందించారు.

భావితరాలకు సాహిత్య ఫలాలు అందించాలి



మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్, వేదికపై డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు

విజయవాడ కల్చరల్: భావితరాలకు సాహిత్యఫలాలు అందించాలని సేవ్ ఇండియా వ్యవస్థాపకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. విశ్వసాహితీ సాహిత్యవేదిక జాతీయ సంస్థ ఆవిర్భావ సభను ఏలూరు రోడ్డులోని ఇండియన్ మెడికల్ హాల్‌లో ఆదివారం నిర్వహించింది. సంస్థను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కవులు సామాజిక దృక్పథం కలిగి వుండాలని సూచించారు. సమాజాన్ని అధ్యయనం చేయాలని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సాహితీ సృజన చేయాలని సూచించారు. 2026 జనవరిలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ బోణం గణేష్ రచించిన వర్ణం కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. గణేష్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి సంస్థ లక్ష్యాలను వివరించారు. సమావేశంలో వివిధ రంగాలకు చెందిన గోళ్ళ నారాయణరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయకవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి, శ్రీనివాసా నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో పద్యనాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దత్తుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీర్ అంబేడ్కర్, కలియుగ వైకుంఠం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. ప్రవేశం ఉచితమన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని 28వ డివిజన్ సత్యనారాయణపురం స్టార్ ఫిజియోథెరపీ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ప్రత్యేకావసరాల చిన్నారులకు వేషధారణ పోటీలు జరిగాయి. పోటీలలో ప్రత్యేక చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, రుక్మిణి, గోపికల అలంకారంలో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎం.ప్రభుదాస్ మాట్లాడుతూ ప్రత్యేక చిన్నారులకు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయటంతో పాటు ఇతర చిన్నారులతో కలిసిమెలసి ఉండేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులు ఉట్టికొట్టారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారులు, వారి తల్లితండ్రులు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ పీ పూర్ణిమ, చైతన్య తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాకారానికి జీరో పావర్టీ కీలకం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్‌కు ప్రమాణ పత్రాలు అందజేస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 విధానంలో వర్ధమాన్ వికాస్ సంస్థ, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్) భాగస్వాములయ్యాయి. వర్ధమాన్ వికాస్ సంస్థ 500 కుటుంబాలను, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ 74 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించనున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశను కలిశారు. మార్గదర్శిగా కొనసాగేందుకు తమ ఆసక్తిని తెలియజేస్తూ కలెక్టర్‌కు ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి జీరో పావర్టీ కీలకమని పేర్కొన్నారు. సమాజంలో పేదరికం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ఆవిష్కృతమైన పీ4లో భాగస్వాములైనందుకు వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే జిల్లాలో 6,102 మంది మార్గదర్శులు 53,370 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. ప్రమాణ పత్రం అందజేసిన వారిలో వర్ధమాన్ వికాస్ సంస్థ సభ్యులు సీతల్ జైన్, దీక్షిత్ జైన్, దీక్షిత్ చౌహాన్, ప్రవీణ్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీ జైన్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ చైర్మన్ జె.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్‌టీ వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.నరేంద్ర ఉన్నారు.

గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



గాయత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గాయత్రి అమ్మవారి పేరుమీద సొసైటీ ఏర్పాటు చేసి అనేక సేవా కర్యక్రమాలు నిర్వహిస్తున్న గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని గాయత్రి సొసైటీ నాల్గోవ వార్షిక వేడుకలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనేక సేవా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించడం పట్ల సొసైటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మెడికల్ క్యాంపులు నిర్వహించి పేద బ్రాహ్మణులకు మందులను ఉచితంగా అందజేయడం, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకునే విధంగా ప్రతి ఏటా సామూహిక ఉపనయనాలు, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా సొసైటీ సేవలను మరింత విస్తృత పర్చాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, సొసైటీ అధ్యక్షుడు జె.కె.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సనత్, చంద్రశేఖర్, లంకా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం సామాజిక బాధ్యత



అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన గోపువారి సత్రంలో అన్నదానాన్ని సోమవారం గోపు మురళీధర్ ఆర్య, సంస్థ గౌరవాధ్యక్షుడు వంకదార వాసుదేవరావు చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ వారు గత నాలుగు సంవత్సరాలుగా నగరంలో పలుచోట్ల అన్నదానం చేయటం అభినందనీయం అన్నారు. ఇప్పుడు గోపు వారి సత్రంలో కూడా అన్నదానం ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ మాట్లాడుతూ తాము ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో ప్రతీ రోజు పాత ప్రభుత్వాసుపత్రి, ఏలూరు రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద, బ్రాహ్మణవీధి తమ్మన వారి సత్రం వద్ద అన్నదానం చేస్తున్నామన్నారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపటం సామాజిక బాధ్యతగా గుర్తించి సేవలు అందిస్తున్నామని అన్నారు. ట్రస్ట్ కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి, కోశాధికారి గోపాలని రాధా కృష్ణ మాట్లాడారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పునరావాస కేంద్రాల జాబితా

పటమట(విజయవాడతూర్పు): ప్రతి సచివాలయంలో సమీపంలోని పునరావాస కేంద్రాల జాబితాను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం గాంధీజీ మహిళా కళాశాల, మోటూరి హనుమంతరావు ప్రభుత్వ పాఠశాల, శ్రీ వెలగపూడి లక్ష్మణ దత్తు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, మామిడికాయల పాకల వద్ద ఉన్న వంగవీటి మోహన రంగా కళ్యాణమండపం, రామలింగేశ్వరనగర్‌లోని వీఎంసీ ప్రైమరీ హై స్కూల్లో ఉన్న పునరావాస కేంద్రాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో ఏర్పాటులు పూర్తిస్థాయిలో ఉండాలని, ప్రతి పునరావాస కేంద్రానికి రేటింగ్ ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రంలో అక్కడ ఉండేట్టు తెలిపే సూచిక బోర్డు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, మరుగుదొడ్లు, వాటిని సూచించే బోర్డులు, ప్రధానంసాలుగా ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేటట్టు ఈ రేటింగ్ పనికొస్తుందని అధికారులు అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఒడ్డుకు చేరాయి

కృష్ణా నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదిలో తిరిగే పడవలను సోమవారం భవానీ ఘాట్ వద్ద ఒడ్డుకు చేర్చారు. వరద ప్రవాహానికి పున్నమి ఘాట్‌లో ఐరన్ ర్యాంప్ విరిగిపోయింది. ఘాట్ మెట్ల పరిసరాల్లో బురద పేరుకుపోయి కనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి



రాజారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు దాటుతూ ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భానునగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రాజారావు (39) రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో రాజారావును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో మృతి చెందాడు. రాజారావుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన కొడుకు తిరిగి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్రికలో నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్ షకీలా, కుమారుడు దాదావీర్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుంటారు. ఫిర్యాది కోడలు మంగళగిరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటుంది. ఈ నెల 17న కోడలితో గొడవ పడిన కుమారుడు ఏపీ 39ఆర్ 2549 యాక్సెస్ బండిపై వెళ్లి తిరిగి రాలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.